క్లుప్తంగా

హర్యానా గవర్నర్‌ను కలిసిన 'అడ్లూరి'



గవర్నర్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్

ధర్మపురి: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి, సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బషీర్‌పల్లెను గ్రామ పంచాయతీ చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని చింతలూరు పరిధిలోని బషీర్‌పల్లె తండాను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన నాయకులు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రామపంచాయతీగా ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తండా నాయకులు ప్రభాకర్, బాపురావు నాయక్, రమేశ్‌నాయక్, రామ్‌నాయక్, రమేశ్, రాజశేఖర్, సక్రియ, గంగాధర్, రెడ్డినాయక్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు ఎమ్మెల్సీకి ఆహ్వానం



జీవన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నాయకులు

సారంగాపూర్: మండలంలోని నాగునూర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేయాలని సంకల్పించడం సంతోషంగా ఉందని, ఆహ్వానితులను, గ్రామస్తులను ఆయన అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయికల్: మండలంలోని అల్లీపూర్ తాలుక గంగారెడ్డి కూతురు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట అత్తినేని గంగారెడ్డి ఉన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

జగిత్యాలక్రైం: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ద్యావనందుల విజయ్ ద్విచక్ర వాహనం బుధవారం ఉదయం కొత్త బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. బుధవారం ఉదయం కొత్త బస్టాండ్‌లో పార్కింగ్ చేసి కోరుట్ల వెళ్లి తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. కొత్తబస్టాండ్‌లో సీసీ ఫుటేజీని పరిశీలించగా, గుర్తుతెలియని వ్యక్తి తన వెంట తెచ్చుకున్న కీ ద్వారా ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు వినియోగించుకోవాలి

కోరుట్లరూరల్: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను వినియోగించుకోవాలని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ ట్రాఫిక్ లాజిస్టిక్ అసిస్టెంట్ మేనేజర్ రామారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను బుధవారం సందర్శించారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి, తుంగూర్, వెల్గటూర్, కొడిమ్యాల, మేడిపల్లి, కథలాపూర్, రుద్రంగి ప్రాంతాల్లోని చిరు వ్యాపారులు, వర్తకవాణిజ్య వ్యాపారులు కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీలకు నిధులు మంజూరు

పెగడపల్లి: గ్రామ పంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ కింద రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 380 గ్రామ పంచాయతీలకు రూ.162.13కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో పంచాయతీ కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ కిస్తీలు చెల్లించాలని సూచిస్తూ పంచాయతీ రాజ్‌శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు వస్తుండటంతో పంచాయతీ కార్యదర్శులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ నిధులు రెండు మూడు రోజుల్లో గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.



తొమ్మిది రోజులూ సంబరాలే..



బతుకమ్మ పండుగ కోసం ఏడాదంతా వేచి చూస్తాం. తీరా పండగగొచ్చి 9రోజులు ఎలా గడిచాయో తెలియనంత సంబరంగా సాగుతుంది. ఈ పండుగ రోజులు షాపింగ్, బతుకమ్మ ఆటలతో బిజీగా గడిచిపోతుంది. బంధువులు, ఫ్రెండ్స్‌తో బతుకమ్మ పండుగ ఎంతో హుషారుగా గడిపేస్తాం. – కాసారపు ప్రణీత, జగిత్యాల

బతుకమ్మ పాటలకు ప్రాధాన్యం



బతుకమ్మ పాటలకు ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం కొన్ని పాటలు మాత్రమే ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇంకా అనేక పాటలు వెలుగులోకి రావాల్సింది. ప్రపంచంలో పూలతో బతుకమ్మను పేర్చి పూజించడం నిజంగా గొప్ప విషయం. – సుంకరి మమత, మాజీ సర్పంచ్, నందగిరి

ఊరంతా సందడే



బతుకమ్మ పండుగ వచ్చిందంటే మా ఊరంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. ఆడపిల్లలు తల్లిగారింటికి, అమ్మమ్మ ఊర్లకు కొందరు చేరుకుంటారు. ఈ పండుగ రోజుల్లో తొమ్మిదిరోజులపాటు ఇంటింటా సందడే.

– జువ్వాజి రేవతి, గంభీర్‌పూర్



జగిత్యాలరూరల్: మోరపల్లిలో నాయకుల నివాళి



రాయికల్: ప్రతిజ్ఞ చేస్తున్న వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు



మల్లాపూర్ గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో



సారంగాపూర్: నివాళి అర్పిస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ నివాళి



కథలాపూర్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పెంబట్లలో నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో గంగాధర్



మల్యాలలో..



రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

ఘనంగా గాంధీ జయంతి

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/రాయికల్/కథలాపూర్/మల్యాల/ ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/ సారంగాపూర్: గాంధీజయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంధ సంస్థల కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

నేటి నుంచి దుర్గా నవరాత్రోత్సవాలు



ధర్మపురిలో నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు

ధర్మపురి: పట్టణంలోని నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గా నవరాత్రోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. గత పదేళ్ల నుంచి స్థానిక న్యూ టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న అమ్మవారి నవరాత్రోత్సవాలు నేటి నుంచి 12 వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. దీని కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. అంబేద్కర్ విగ్రహం జాతీయ రహదారి నుంచి బస్టాండ్ వరకు రంగుల రంగుల విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. దుర్గామాత (భవానీ)మాలలు వేసి తొమ్మిది రోజుల పాటు కన్నుల పండువగా జరిపిస్తారు.

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి: దసరా సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ నిరంజన్‌రెడ్డి బుధవారం సూచించారు. బంగారం, నగదు వంటి విలువైన వాటిని ఇళ్లల్లో ఉంచవద్దన్నారు. తమ వెంట తీసుకెళ్లాలని, లేదా బ్యాంక్ లాకర్లల్లో పెట్టుకోవాలని సూచించారు. కాలనీల్లో అనుమానస్పదంగా సంచరించే వారి గురించి స్థానిక పోలీసులకు లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలన్నారు. దొంగతనాలు జరగకుండా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

దుర్గమాత కరపత్రం ఆవిష్కరణ

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన యువకులు శ్రీనవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి నిర్వహిస్తున్న దుర్గ శరన్నవరాత్రోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గ్రామ యువకులతో కలిసి ఆవిష్కరించారు.

స్వచ్ఛతా హీ సేవా నిరంతర ప్రక్రియ

జగిత్యాల: స్వచ్ఛతా హీ సేవా నిరంతర ప్రక్రియ అని, పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సావిత్రిబాయి పూలే పార్క్‌లో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నాయని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల సహకారం తప్పనిసరన్నారు. అలాగే ప్రతి ఒక్కరు పార్క్‌ల సంరక్షణలో పాల్గొనాలని సూచించారు. పట్టణానికి రూ.50 లక్షలు ఎఫ్‌డీఆర్ నిధులు కేటాయించేలా చూస్తానన్నారు. జగిత్యాలలోని మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో పారిశుధ్యం, స్వచ్ఛత, రోడ్ల మరమ్మతులు చేస్తున్నామని, అవసరమైతే సీఎంతో మాట్లాడి మరిన్ని నిధులు మంజూరు చేసేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



'స్వచ్ఛతా హీ సేవా'లో ఎమ్మెల్యే, చైర్‌పర్సన్



కోరుట్ల బతుకమ్మతో మహిళలు

ఎంగిలిపూల బతుకమ్మ

కోరుట్ల: పట్టణంలోని భీమునిదుబ్బలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక మహిళలు బతుకమ్మలతో తరలివచ్చి ఆట-పాటలతో సందడి చేశారు.

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ పండుగ వేడుకలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలతో సామూహికంగా ఆడిపాడారు. తొమ్మిది రోజుల పాటు సాగే బతుకమ్మ పండుగ వేడుకల్లో మహిళలు మొదటి రోజు ఉత్సాహంగా బతుకమ్మ ఆడిపాడి నిమజ్జనం చేశారు.



పెగడపల్లిలో..

గ్రామ పంచాయతీల్లో సభలు

జగిత్యాలరూరల్: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని జగిత్యాల రూరల్ ఎంపీవో రవిబాబు అన్నారు. బుధవారం కల్లెడ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు.

రాయికల్: మండలంలోని 32 గ్రామాల్లో బుధవారం గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం గాంధీజీ జయంతి సందర్భంగా గ్రామ సభలు నిర్వహించారు.ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ పాల్గొన్నారు.

కథలాపూర్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామ సభలో పాల్గొన్నారు. ఉపాధి హామీలో చేపట్టే పనులు గుర్తించారు. సమావేశాల్లో ఎంపీవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆవాసానికి లక్ష విరాళం

జగిత్యాలటౌన్: సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసం నూతన భవన నిర్మాణానికి గొల్లపల్లి రాజాగౌడ్ సుశీలమ్మ ట్రస్ట్ నుంచి రూ లక్ష విరాళం అందజేశారు. పట్టణంలోని వాల్మీకి ఆవాసానికి గొల్లపల్లి రాజాగౌడ్ సుశీలమ్మ దంపతుల కుమారులు జిల్లా గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్, గొల్లపల్లి శ్రీధర్‌గౌడ్ బుధవారం రూ.లక్ష చెక్ అందజేశారు. కార్యక్రమంలో రాజాగౌడ్ కుటుంబ సభ్యులు, ఆవాసం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మెట్‌పల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు కోసం బుధవారం మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేష్‌లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. షెల్టర్ ఏర్పాటు కోసం గతంలో మున్సిపాలిటీలో తీర్మానం చేశారని, నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గుంతలు పూడ్చిన జీపీ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో పీనుగుల గుంట వద్దనుంచి ఇందిరాగాంధీ చౌరస్తా వరకు ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం పూడ్చి వేశారు. మూలరాంపూర్ నుంచి ఇబ్రహీంపట్నం ఇందిరాగాంధీ చౌరస్తా వరకు రెన్యూవల్ బీటీ మంజూరు కాగా, కాంట్రాక్టర్ గతేడాది రెన్యూవల్ బీటీ పనులు పీనుగల గుట్టవద్దకే పనులు చేసి ఆపివేశారు. దీంతో గ్రామపంచాయతీఆధ్వర్యంలో కార్యదర్శి రామకృష్ణ డస్ట్ పోయించి ట్రాక్టర్‌తో చదును చేయించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నాకర్ రావు విగ్రహావిష్కరణ స్థల పరిశీలన

కోరుట్ల: పట్టణ శివారులోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వ విద్యాలయం ఎదుట ఏర్పాటు చేస్తున్న మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 4న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విగ్రహావిష్కరణ స్థలాన్ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు బుధవారం పరిశీలించారు. కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరవుతారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్ రావు, సీఐ సురేశ్ బాబు, ఎస్సై శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

సారంగాపూర్: మండలంలోని నాయికపుగూడెం భీమన్న ఆలయం వద్ద భక్తులు సేదదీరడానికి నిర్మాణం చేసిన స్లాబ్‌పై మర్రి ఊడలు, కొమ్మలు పెరిగి స్లాబ్‌కు నష్టం చేస్తున్నాయని 'సాక్షి'లో ప్రచురితమైన ఫోటో స్టోరీకి ఎంపీడీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు స్పందించారు. కూలీలను ఏర్పాటు చేసి కొమ్మలను, వేర్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా సాక్షికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఇబ్రహీంపట్నం, వర్షకొండ గ్రామాల్లో దసరా బ్రహ్మోత్సవాలకు నిర్వహించేందుకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నుంచి దసరా వరకు శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలను నిర్వహించేందుకు ఉత్సవమూర్తులను పూలతో అందంగా అలంకరించారు. ప్రతి రోజూ రాత్రి ఉత్సవమూర్తులను గ్రామాల్లో ఊరేగించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

జిల్లాలో పోలీస్‌యాక్ట్ అమలు

జగిత్యాలక్రైం:శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఈనెల 31 వరకు సిటీ పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. పోలీస్ అధికారు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.